# పెథాయ్ పలకరిస్తే..

తిరువూరు, న్యూస్‌టుడే

## సాగులోని వరి, పత్తి, మిర్చి పంటలకు నష్టం

**అప్రమత్తమైన అధికారులు.. మండల స్థాయిలో సమీక్షలు**

**కనీస సౌకర్యాలకు అంతరాయం లేకుండా చర్యలు**


తిరువూరు: లక్ష్మీపురం సమీపంలో కళ్లంలో ఆరబెట్టిన ధాన్యం


తిరువూరు: జి.కొత్తూరు సమీపంలో తీతకు సిద్ధంగా ఉన్న పత్తి

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం పెనుతుపానుగా విరుచుకుపడుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జిల్లా రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో తుపాన్లు, భారీవర్షాలు పలకరిస్తుంటాయి. గత ఏడాది జిల్లాకు ఒక్క తుపాన్ కూడా రాలేదు. ఈ ఏడాది ఆగస్టు తరువాత ఇప్పటి వరకు చినుకు జాడ లేదు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తలెత్తిన సాగునీటి ఎద్దడితో పత్తి, వరి పంటలు కొన్నిచోట్ల ఎండిపోగా, మరికొన్ని చోట్ల పంట దిగుబడులపై ప్రభావం చూపింది. ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు పెసర రైతులు పూర్తిగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో తుపాను విరుచుకుపడితే.. నిలువుపై ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి వంటి పంటలు నేలవాలే ప్రమాదముంది. వీటితో పాటు సామాజిక జీవనానికి ఎన్నో విధాలుగా అంతరాయం ఏర్పడే అవకాశముంది. తుపాను విరుచుకుపడిన తరవాత నష్టనివారణ చర్యలు ఎలాగూ తప్పవు. నష్టతీవ్రత తక్కువగా ఉండే విధంగా ముందస్తుగా యంత్రాంగం తీసుకునే చర్యలే ప్రజలకు శ్రీరామరక్ష అవుతాయి.

### ఆరోగ్యం.. భద్రం

తుపాన్ నేపథ్యంలో విస్తారంగా వర్షాలు కురిస్తే దోమల ఉద్ధృతి పెరగనుంది. తాగునీటి కలుషితం వంటి కారణాలతో కూడి అనారోగ్యం బారినపడే వీలుంది. ఈ నేపథ్యంలో ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జలుబు, దగ్గు, జ్వరం, వాంతులు, విరేచనాలు, ఇతరత్రా మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు చెబుతున్నారు.

### విద్యుత్తు అంతరాయం



బలమైన ఈదురుగాలులు వీస్తే చెట్లు, స్తంభాలు కూలి విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో డిస్కం అధికారులు ముందుగానే కరెంట్ తీగలపై వాలిన చెట్ల కొమ్మలను నరికించడం ద్వారా కొంత వరకు సమస్యను అధిగమించడానికి వీలుంది. విద్యుత్తు తీగలు తెగిపడితే ప్రాణనష్టం వాటిల్లనుంది. కిందకు వేలాడుతున్న తీగలను తక్షణం సరి చేయాల్సి ఉంది. మరమ్మతులు చేపట్టేందుకు స్తంభాలను కూడా అందుబాటులో ఉంచారు.

### జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)

| | |
|---|---|
| వరి | : 2.47 లక్షలు |
| పత్తి | : 46,099 |
| మిర్చి | : 12,816 |
| మొక్కజొన్న | : 5,464 |
| కంది | : 4,657 |

### తాగునీటి సమస్య తలెత్తకుండా

వర్షాలకు కాలువలు, డ్రెయిన్లు పొంగి ప్రవహించడంతో పైపులైన్లకు లీకేజీలు ఏర్పడిన చోట మురుగునీటితో కలుషితం కావడానికి వీలుంది. ఈ నేపథ్యంలో లీకేజీలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేపడితే సమస్యను అధిగమించడానికి అవకాశం ఉంది. రక్షితనీటి పథకాల మోటార్లు పనిచేయడానికి జనరేటర్లు, డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలి. ప్రజలకు తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, మున్సిపల్ అధికారులు కృషిచేయాలి.



### యంత్రాంగంపైనే బాధ్యత

కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని 49 మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ, పోలీసు, మండల పరిషత్, వ్యవసాయ, ఉద్యాన, పురపాలిక తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. సమస్యలు తలెత్తితే అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధిగమించడానికి సన్నద్ధులుగా ఉండాలి. కాలువలు, డ్రెయిన్లు పూడుకుపోతే కాలనీల్లోకి వరదనీరు ముంచెత్తే అవకాశం ఉన్నందున ఎక్కడికక్కడ గండ్లు కొట్టడానికి పొక్లెయిన్, జేసీబీ, డోజర్లు, ట్రాక్టర్లు అందుబాటులో ఉంచుకోవాలి.



### పంట నష్టం వాటిల్లకుండా..

పంట నష్టం వాటిల్లకుండా వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు దృష్టిసారించాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులను అప్రమత్తం చేస్తూ మెట్ట, మాగాణి పంటల నూర్పిడి, తీత, కోత పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా పర్యవేక్షించాలి. రైతులకు పంపిణీ చేయడానికి టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి. పంట నష్టం జరగకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలి.

### పహారా తప్పదు



ఆగస్టులో కురిసిన వర్షాలకు పశ్చిమ కృష్ణాలో పలు రహదారుల్లో వంతెనలు, కాజ్‌వేల పైనుంచి మూడు నుంచి ఐదు అడుగుల ఎత్తులో ప్రవహించడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బందితో నిరంతరాయంగా వాగుల వద్ద పహారా ఏర్పాటు చేశారు. ఎలాంటి ప్రమాదాలకు అస్కారం లేకుండా ట్రాఫిక్‌ను ఇతర మార్గాల్లోకి మళ్లించారు. ఈ సారి కూడా ఇలాంటి చర్యలు చేపట్టాలి. చెరువుల్లోకి వరద పోటెత్తితే బలహీనంగా ఉన్న కరకట్టలు తెగిపోకుండా ఇసుక నింపిన సంచులను అందుబాటులో ఉంచుకోవాలి.

### పంటల స్థితి..

- జిల్లా వ్యాప్తంగా వరి నూర్పిడి ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. ఇప్పటికే 80 శాతానికి పైగా పూర్తి చేశారు. మరో 20 శాతం నిలువు, పనలపై ఉంది. ఇంకో వైపు నూర్పిడి చేసిన ధాన్యాన్ని కళ్లాల్లోనే వ్యాపారులు కొనుగోలు చేస్తుండగా.. ప్రభుత్వం కేంద్రాల ద్వారా సేకరిస్తోంది. ధాన్యం తూకం, ఎగుమతులు ముమ్మరంగా సాగుతున్నాయి.
- అనావృష్టి దృష్ట్యా పత్తి పంట దిగుబడులు సగం తగ్గాయి. ఇప్పటికే మూడు తీతలు పూర్తయ్యాయి. కూలీల కొరత నాలుగో విడత పత్తితీతకు అవరోధంగా మారింది. ఎక్కడ చూసినా విచ్చుకున్న పత్తితో దర్శనమిస్తున్నాయి. ఎకరానికి కనీసం రెండు, మూడు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. ఈ సమయంలో భారీ వర్షం కురిస్తే పంట నష్టం తప్పదు.
- మొక్కజొన్న పైరు ఏపుగా ఎదిగి కంకిదశలో ఉంది. కంది పంట పూత, పిందె దశలో ఉంది. మిర్చి కాయ కోత పనులు చేపట్టాల్సి ఉంది. అసలే ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రైతులకు మరింత నష్టం వాటిల్లనుంది.